


**రాష్ట్రవ్యాప్తంగా భారీగా మున్సిపల్ కమిషనర్‌ల బదిలీ**

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103

సంపుటి - 2 సంచిక -100 బుధవారం 25 జూన్ 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## రైతులే మా ప్రథమ ప్రాధాన్యం



- రైతును రాజు చేయడమే మా లక్ష్యం - వ్యవసాయాన్ని పండగ చేసి చూపిస్తున్నాం - 9 రోజుల్లో 9 వేలకోట్ల మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ - కెసిఆర్ ఎగ్గొట్టిన 7వేల కోట్లను కూడా జమచేసి చూపాం - సన్నవడ్లకు 500 బోనస్ ఇస్తామని ఇచ్చిన ఘనత మా ప్రభుత్వానిదే - బనకచర్లకు తలూపిందే కెసిఆర్... దీనిపై అసెంబ్లీలో చర్చ కు రావాలి - రైతునేస్తం సభలో సిఎం రేవంత్ రెడ్డి ఉద్వేగపేరిత ప్రసంగం



**హైదరాబాద్, జూన్24(జర్నలిస్ట్ వార్త):** రైతు భరోసా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వ్యవసాయం అంటే.. రైతును రాజును చేయడం అని తెలుసన్నారు. రైతులకు అండగా నిలిచి, వారికి చేదోడువాదోడుగా కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. వ్యవసాయాన్ని దండగ అనే స్థాయి నుంచి పండగ చేసేందుకే వైఎస్ఆర్ ఆనాడు ఉచిత విద్యుత్ అందించారని చెప్పారు. రైతుల ఆశీర్వాదం వల్లనే చిన్న వయస్సులో సీఎం అయ్యానని, రైతాంగం అభివృద్ధికి సాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన రైతు భరోసా నిధుల పంపిణీ కార్యక్రమం మంగళవారంతో పూర్తయింది. 9 రోజుల్లో 9 వేలకోట్ల మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేశారు. రైతుభరోసా కార్యక్రమం

మిగతాది 2లో

## కెసిఆర్ కనుసన్నల్లోనే ఫోన్ ట్యాపింగ్

- తమ ఫోన్లు ట్యాప్ చేసినట్లు వాంజ్మూలం
- నత్తనడకన సాగుతోన్న ట్యాపింగ్ కేసు
- బిఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్
- బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ఆరోపణ



**హైదరాబాద్, జూన్24(జర్నలిస్ట్ వార్త):** దమ్ము, ధైర్యం లేక తమ ఫోన్లను ట్యాపింగ్ చేశారని ఎంపి ఈటల రాజేందర్ మండిపడ్డారు. బిఆర్ఎస్ హయాంలో తమ ఫోన్లు ట్యాప్ చేశారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వల్ల రాష్ట్రంలో భాజపా చాలా చోట్ల ఓడిపోయిందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు నత్తనడక సాగుతోందని, బిజెపి, కాంగ్రెస్ మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని విమర్శించారు. అందుకే ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో వేగం లేదని అన్నారు. ప్రభాకర్ రావు నిబంధనలు అతిక్రమించి మాజీ సిఎం కెసిఆర్ కోసం పని చేశారని ఈటల రాజేందర్ ఆరోపించారు. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు

మిగతాది 2లో



## మహారాష్ట్ర ఎన్నికల్లో రిగ్గింగ్ ఆరోపణలు

- రాహుల్‌ను చర్చలకు రావాలంటూ ఇసి లేఖ

## కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం

- 9రోజుల్లో 9 వేల కోట్లు రైతు ఖాతాలో జమ
- సన్నధాన్యం రైతులకు క్వింటాకు 500 చొప్పున బోనస్
- రూ.22వేల కోట్ల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి



**హైదరాబాద్, జూన్24(జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం.. వ్యవసాయం అంటేనే కాంగ్రెస్ అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రైతు భరోసా కింద పెట్టుబడి సాయం తొమ్మిది రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు రైతు ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. రైతు భరోసా మూలంగా రాష్ట్రంలో సాగు యోగ్యమైన 1.49 కోట్ల ఎకరాలకు 69.70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి 9 వేల కోట్లు వేశామని చెప్పారు. సన్నధాన్యం సాగు చేస్తున్న రైతులకు క్వింటాకు 500 చొప్పున బోనస్ రూపంలో ఈరోజు వరకు 1,199 కోట్ల రూపాయలు రైతులకు ప్రజా ప్రభుత్వం చెల్లించిందని వెల్లడించారు. రైతన్నకు ఊహించని ప్రమాదం జరిగితే ఆ కుటుంబానికి భరోసా ఇచ్చేందుకు రైతు బీమా పథకాన్ని అమలు అమలు

మిగతాది 2లో

## విజయోత్సవాలు కాదు.. రైతులకు క్షమాపణ చెప్పాలి: హరీష్ రావు



**హైదరాబాద్, జూన్24(జర్నలిస్ట్ వార్త):** స్థానిక సంస్థల ఎన్నికల ముందు రైతు భరోసా పేరిట ఆడుతున్న డ్రామాలు ఆపి, 19 నెలల కాలంలో రైతన్నను అరిగోస పెట్టుకున్నందుకు కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని మాజీ మంత్రి,బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్‌రావు ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఎకరాకు రూ.15,000 చొప్పున ఇస్తామని చెప్పి రూ.12,000కి పరిమితం చేయడం మోసం చేయడమే అని, గత వానకాలం రైతు భరోసా ఎగ్గొట్టి, యాసంగిలో ఎగ్గొట్టి, ఓట్ల కోసం ఇప్పుడు విజయోత్సవాల పేరిట సంబరాలు జరపడం

మిగతాది 2లో

## ప్రతిష్టాత్మకంగా ఉజ్జయిని మహంకాళి బోనాలు



- రాజకీయాలకు అతీతంగా ఉత్సవాల నిర్వహణ
- భక్తులకు ఇబ్బంది లేకుండా పక్కాగా ఏర్పాట్లు
- అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష
- పటిష్టాంగా ఏర్పాట్లు చేయాల మంత్రి పొన్నం సూచన

**హైదరాబాద్, జూన్24(జర్నలిస్ట్ వార్త):** చారిత్రాత్మకమైన ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు రాజకీయాలకు అతీతంగా అత్యతం వైభవంగా చేసుకుందామని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. నగరంలో ఎంతో వైభవంగా జరిగే సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఉత్సవాలపై ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అమ్మవారి బోనాల ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం పక్షాన ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా స్థానికుల సహకారం

మిగతాది 2లో



## వచ్చే నెల 4న హైదరాబాద్‌కు మల్లిఖార్జున ఖర్గే

## పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో తెలంగాణకు జాతీయ గుర్తింపు..




## సవాళ్లను అధిగమించేందుకు సిద్ధంగా ఉండాలి: సీఎం రేవంత్




**హైదరాబాద్, జూన్24(జర్నలిస్ట్ వార్త):** భవిష్యత్తులో అనేక సవాళ్లు ఎదురుకానున్నం దున వాటిని అధిగమిం చేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ నాయకులకు పిలుపు నిచ్చారు. డీలిమిటేషన్ ప్రక్రియ, మహిళా రిజర్వేషన్ల అమలు, జమిలి ఎన్నికల నిర్వహణ వంటి కీలక పరిణామాలు భవిష్యత్తులో చోటు చేసు కోనున్నాయని ఆయన పార్టీ నేతలకు వివరిం చారు. పీసీసీ రాజకీయ వ్యవహారాల

మిగతాది 2లో

అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..





## వచ్చే నెల 4న హైదరాబాద్‌కు మల్లిఖార్జున ఖర్గే

**హైదరాబాద్, జూన్24(జర్నలిస్ట్ వార్త):** ఏఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే వచ్చే నెల 4న హైదరాబాద్‌కు రానున్నారు. మంగళవారం జరిగిన పార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల సమావేశంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించే సభలో ఖర్గే పాల్గొంటారని ఆయన చెప్పారు. ఈ సభను విజయవంతం చేయడానికి పార్టీ నూతన కార్యవర్గం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన కోరారు. నూతన కార్యవర్గంతో కూడా ఖర్గే సమావేశమవుతారని ఆయన తెలిపారు.

## పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో తెలంగాణకు జాతీయ గుర్తింపు..



**న్యూఢిల్లీ, జూన్24(జర్నలిస్ట్ వార్త):** పాస్‌పోర్ట్ దరఖాస్తుదారుల ధృవీకరణలో ఆధునిక సాంకేతికత వినియోగానికి గుర్తింపుగా, తెలంగాణ పోలీసులకి జాతీయ స్థాయి ప్రశంస లభించింది. ఇంటెలిజెన్స్ విభాగం డైరెక్టర్ జనరల్ బి. శివధర్ రెడ్డి, న్యూఢిల్లీలో జరిగిన పాస్‌పోర్ట్ సేవా దివస్ కార్యక్రమంలో రాష్ట్ర పక్షాన ఈ అవార్డును స్వీకరించారు. అవార్డును కేంద్ర విదేశాంగ శాఖ సహాయమంత్రి పబిత్ర మార్గరీటా ప్రదానం చేశారు. తెలంగాణ పోలీసుల రూపొందించిన "వెరిఫాస్ట్" యాప్ దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ వేదికగా గుర్తింపు పొందింది. కేంద్ర విదేశాంగ శాఖ విడుదల చేసిన తాజా జాతీయ గణాంకాల ప్రకారం, తెలంగాణ రాష్ట్రం అత్యంత వేగంగా పాస్‌పోర్ట్ ధృవీకరణ పూర్తి చేసే రాష్ట్రంగా నిలిచింది. చాలా కేసులను కేవలం మూడు నుంచి పది దినాల్లోనే పూర్తి చేస్తోంది.డీజీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ, "పాస్‌పోర్ట్ ధృవీకరణలో తెలంగాణ ఒక 'గోల్డ్ స్టాండర్డ్' స్థాయిని ఏర్పరిచింది. పౌరసేవల అనుభవాన్ని మరింత మెరుగుపరిచే దిశగా మేము నిరంతరం నూతన ఆవిష్కరణలపై పని చేస్తున్నాము," అని తెలిపారు.

## సవాళ్లను అధిగమించేందుకు సిద్ధంగా ఉండాలి: సీఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

కమిటీ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. త్వరలోనే మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీల్లో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అదేవిధంగా, జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరగనున్న ఉప ఎన్నికకు పార్టీ శ్రేణులను ఇప్పటి నుంచే సమాయత్తం చేయాలని ఆయన సూచించారు.పార్టీ కోసం నిరంతరం శ్రమించే వారికే సముచిత స్థానం లభిస్తుందని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. "మరోసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా పనిచేయాలి. ఇందుకోసం బూత్ స్థాయి నుంచి గ్రామ, మండల స్థాయి వరకు పార్టీ కమిటీలను పటిష్టంగా ఏర్పాటు చేయాలి. పార్టీ కమిటీల్లోని నాయకులు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పనిచేయాల్సిందే. పనితీరు కనబరిస్తేనే పదవులు దక్కుతాయి. పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు అండగా నిలిచి, కష్టపడి పనిచేసిన వారికి ఇప్పటికే పదవులు ఇచ్చాం, భవిష్యత్తులో కూడా ప్రాధాన్యత ఉంటుంది" అని రేవంత్ రెడ్డి అన్నారు.నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించుకుని పార్టీ నాయకులు ముందుకు సాగాలని ఆయన హితవు పలికారు. అవసరమైతే తాను కూడా గ్రామాల్లో పర్యటించేందుకు సిద్ధంగా ఉన్నానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పార్టీ, ప్రభుత్వం మధ్య పూర్తి సమన్వయంతో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని ఆయన పునరుద్ఘాటించారు.

## కౌశిక్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై ముగిసిన విచారణ

**హైదరాబాద్, జూన్24(జర్నలిస్ట్ వార్త):** క్వారీ యజమానిని బెదిరిం చిన కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ ముగించింది. వరంగల్ కోర్టు ఇప్పటికే బెయిల్ ఇచ్చినట్లు పిటిషనర్ తరఫు న్యాయవాది రమణారావు కోర్టుకు వివరించారు. సుబేదారీ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని 16న కౌశిక్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. 17న విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం తదుపరి విచారణను మంగళ వారానికి వాయిదా వేసింది. ఆ లోపే 21న కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు.. వరంగల్ జిల్లా కోర్టులో ప్రవేశపెట్టగా.. న్యాయస్థానం రిమాండ్‌ను తిరస్కరించింది. బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను ముగించింది.

## రైతులే మా ప్రథమ ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

విజయవంతంగా పూర్తయిన సందర్భంగా సచివాలయం ఎదురుగా రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద 'రైతు నేస్తం'కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. కేసీఆర్ ఎగ్గొట్టిన రూ. 7 వేల కోట్ల రైతు భరోసా తమ ప్రభుత్వం ఇచ్చిందని అన్నారు. 70 లక్షల మంది రైతుల కళ్ళల్లో సంతోషం చూస్తున్నామని.. రైతుభరోసా కోసం 9 రోజుల్లో రూ. 9 వేల కోట్లు నిధులు రిలీజ్ చేయడం రికార్డ్ అని అన్నారు. 70 లక్షల మంది రైతులకు రైతు భరోసా ఇచ్చామని.. కోటి 49 లక్షల ఎకరాలకు రైతు భరోసా ఇచ్చామని అన్నారు. తెలంగాణ చరిత్ర అంతా రైతులదే అని... భూమి చుట్టూనే మన పోరాటాలు, జీవితాలు ముడిపడ్డాయని అన్నారు. రైతులను ఆదుకున్న చరిత్ర కాంగ్రెస్‌దే అని అన్నారు. మా ప్రజాప్రభుత్వంలో మొదటి ప్రాధాన్యం రైతులే. రైతుల తర్వాత మహిళలు, యువత మా ప్రాధాన్యం. రైతులకు రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో మాట ఇచ్చాం.. నిలబెట్టుకున్నాం అని సిఎం అన్నారు.. 25 లక్షల మందికిపైగా రైతులకు రుణమాఫీ చేశాం. గత ముఖ్యమంత్రి వరి వేసుకుంటే ఉరి వేసుకోవడమే అని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సన్నవడ్లు పండిస్తే బోనస్ ఇస్తామని చెప్పాం. అంతేకాకుండా 48 గంటల్లో డబ్బు జమ చేశాం. దేశంలోనే అత్యధికంగా వరి పండించే రాష్ట్రమని గర్వంగా చెప్పుకొంటున్నాం. గత ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.8 లక్షల కోట్లకుపైగా అప్పులు మా నెత్తిన పెట్టి వెళ్లారు. రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టడం.. కూలడం కూడా జరిగిపోయింది. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు ఫామ్‌హౌస్‌లు ఎలా వచ్చాయి? రాష్ట్రం దివాలా తీస్తే వాళ్లంతా ఎలా సంపన్నులయ్యారు? కేసీఆర్ వేలాది ప్రభుత్వ పాఠశాలలు మూత వేయించారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 60 వేల ఉద్యోగాలు ఇచ్చాం. గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలలు తీసుకువచ్చామని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ ధ్యేయం. మహిళలు సౌర విద్యుత్ ఉత్పత్తి చేసేలా చర్యలు చేపట్టాం. వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్‌పై విద్యుత్‌శాఖతో ఒప్పందం కుదుర్చుకున్నాం. మహిళలకు రూ.21వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చి ఆదుకున్నాం. మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల విక్రయానికి చర్యలు చేపట్టాం. శిల్పారామంలో 150 షాపుల ఏర్పాటుకు స్థలం కేటాయించాం. వెయ్యి బస్సులు కొని ఆర్టీసీకి మహిళలు అ÷–దదెకు ఇచ్చేలా చర్యలు చేపట్టాం. 8 వేల ఐకేపీ కేంద్రాలను మహిళల చేతుల్లో పెట్టాం. పాఠశాలల్లో ఆహార పదార్థాల సరఫరా బాధ్యతను స్వయం సహాయక సంఘాలకు అప్పగించాం. పదేళ్ల భారాస పాలన, 18 నెలల కాంగ్రెస్ పాలనపై చర్చ పెట్టాలి.' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.గోదావరి జలాలపై అసెంబ్లీలో చర్చకు కేసీఆర్ సిద్ధమా?అని సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. ' అసెంబ్లీలో చర్చ కోసం స్పీకర్‌కు లేఖ రాయాలి. కేసీఆర్ చెప్పిన తేదీన అసెంబ్లీలో చర్చ చేపట్టే బాధ్యతను మంత్రి శ్రీధర్‌బాబు తీసుకుంటారు. ఆధారాలు, సంతకాలతో అసెంబ్లీలో చర్చకు వస్తా. కేసీఆర్ సిద్ధమా?ఒకరోజు గోదావరి జలాలు, రెండో రోజు కృష్ణా జలాలపై చర్చిద్దాం. గతంలో సంతకాలు చేసిన కాగితాలు అసెంబ్లీ ముందు ఉంచుతా' అని సీఎం అన్నారు.రైతునేస్తం సభలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్ ను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. 2016లో బానకచర్లకు పునాది వేసింది కేసీఆరే అని.. రోజమ్మ రొయ్యల పులుసు తిని నీళ్లు అప్పగించింది ఎవరని సీఎం రేవంత్ ప్రశ్నించారు. ఎవరు తెలంగాణకు ద్రోహం చేశారో చర్చిద్దామంటూ సవాల్ విసిరారు. మా పాలన, మీ పాలనపై కేసీఆర్ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. కృష్ణానదిపై కేసీఆర్ ఏ ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని అన్నారు. గోదావరి బనకచర్ల విషయంలో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. చంద్రబాబుతో ఉండేవాడిని అయితే.. అక్కడే ఉండేవాడినని అన్నారు. బనకచర్లపై అసెంబ్లీలో చర్చకు కేసీఆర్ సిద్ధమా అని ప్రశ్నించారు సీఎం రేవంత్. అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనే దమ్ము కేసీఆర్ కు ఉందా అని అన్నారు. నీటి హక్కుల విషయంలో తెలంగాణకు మరణశాసనం రాసిందే కేసీఆర్ అని మండిపడ్డారు.

## కెసిఆర్ కనుసన్నల్లోనే ఫోన్ ట్యాపింగ్

(మొదటి పేజీ తరువాయి)

ఎవరి ఆదేశాలతో ఫోన్లు ట్యాపింగ్ చేశారని మల్కాజిగిరి భాజపా ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ముందు వాంగ్మూలం ఇచ్చిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'మా పార్టీ నాయకుల మధ్య జరిగిన సంభాషణను కూడా కాల్ డేటాలో చూపించారు. హుజూరాబాద్‌లో, 2023లో గజ్వేల్‌లో పోటీ చేసినప్పుడు దుర్మార్గమైన పద్ధతిలో నా ఫోన్ ట్యాప్ చేశారు. మునుగోడు ఉప ఎన్నిక వచ్చినప్పుడు మేం.. ఎవరితో మాట్లాడుతున్నాం, ఏం చేస్తున్నామనేది ట్యాపింగ్ ద్వారా తెలుసుకున్నారు. ధైర్యంగా ఎదుర్కోలేని వారే ఇలాంటి అక్రమాలకు పాల్పడతారని మండిపడ్డారు. ప్రభాకర్‌రావు ఐపీఎస్ అధికారి కాదు. అయినా, ఎస్ఐబీ చీఫ్‌గా నియమించారు. విశ్రాంత అధికారిని అక్రమంగా నియమించారు. మార్గదర్శకాలను తుంగలో తొక్కారు. ఫోన్లు ట్యాప్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధం. జడ్జిలు, మంత్రులు, పార్టీ ముఖ్యనేతల ఫోన్లు ట్యాప్ చేశారు. గతంలో ఇంటెలిజెన్స్ మొత్తం కేసీఆర్ వద్దే ఉండేది. కాళేశ్వరంపై కమిటీ నివేదికను ఇంకా బయటపెట్టలేదు. ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ కమిషన్ వేసి ఏడాదిన్నర కావొస్తుంది. భారాస, కాంగ్రెస్ లాలూచీపడకపోతే విచారణ నివేదికలు ఎందుకు భయటపెట్టడంలేదో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో తన రెండు ఫోన్లు ట్యాప్ చేశారని సిట్ అధికారులు చెప్పారని భాజపా నేత ప్రేమేందర్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. రాజకీయ పార్టీ నేతలు, ఉద్యమకారులు, జర్నలిస్టులు, సినీ ప్రముఖుల ఫోన్ కాల్స్ వినడం దారుణమన్నారు. 'భాజపాను దెబ్బతీయడానికే ఫోన్ ట్యాపింగ్‌కి పాల్పడ్డారు. ఫోన్ ట్యాపింగ్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరపాలి. బాధితులు వేల సంఖ్యలో ఉన్నారు. కానీ, కొద్ది మందిని మాత్రమే సాక్షులుగా పిలుస్తున్నారు. దేశ రక్షణ, భద్రత కోసం చేయాల్సిన ఫోన్ ట్యాపింగ్‌ను రాజకీయం కోసం వాడుకున్నారు. ఈ కేసులో అసలైన దోషులు తెలియాలంటే సీబీఐతో విచారణ చేయించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడే అవకాశం ఉంది.

## మహారాష్ట్ర ఎన్నికల్లో రిగ్గింగ్ ఆరోపణలు

● రాహుల్‌ను చర్చలకు రావాలంటూ ఇసి లేఖ




**న్యూఢిల్లీ, జూన్24(జర్నలిస్ట్ వార్త):** గత ఏడాది మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందంటూ లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ పదేపదే ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో దీనిపై చర్చించేందుకు రావాల్సిందిగా ఆయనను భారత ఎన్నికల కమిషన్ పిలిచింది. జూన్ 12న ఈ మేరకు రాహుల్‌కు ఈసీ లేఖ రాసిందని, ఆయన నివాసానికి లేఖ అందిందని విశ్వసనీయ వర్గాలు మంగళవారంనాడు తెలిపాయి. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని, ఎన్నికల ప్రక్రియ సమగ్రతపై అనుమానాలు ఉన్నాయని రాహుల్ ఇటీవల ఆరోపించారు. ఎన్నికల వీడియో ఫుటేజ్, ఫోటోలను ఎన్నికల ఫలితం వెలువడిన 45 రోజుల తర్వాత ధ్వంసం చేయాలని రాష్ట్రాల ఎన్నికల అధికారులను ఈసీఐ ఆదేశించడం తమ అనుమానాలను మరింత బలపరుస్తోందని అన్నారు. అయితే ఈ ఆరోపణలను ఎన్నికల కమిషన్ తోసిపుచ్చింది.ఎన్నికల చట్టాల ప్రకారం ఎన్నికల సరళి రికార్డింగ్ తప్పనిసరి కాదని, పారదర్శకత కోసం ఓటింగ్ పక్రియను రికార్డు చేయిస్తున్నామని ఈసీ తెలిపింది. ఆ వీడియోలను, ఫోటోలను సోషల్ మీడియాలో కొందరు దుర్వినియోగం చేస్తుండటాన్ని గుర్తించామని, ఆ కారణంగానే 45 రోజుల్లోగా ఎలాంటి ఫిర్యాదు రాకపోతే ఫుటేజ్‌లు తొలగించాలని నిర్ణయించామని పేర్కొంది. కాగా, మహారాష్ట్ర ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని, ఓట్ల దొంగతనం జరిగిందని రాహుల్ ఇటీవల ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలు, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల మధ్య కేవలం ఐదు నెలల్లో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ నియోజకవర్గంలో 8 శాతం ఓటర్లు పెరిగారని, కొన్ని బూత్‌లలో 20 నుంచి 50 శాతం ఓటర్లు పెరిగారని 'ఎక్స్' వేదికగా ఆరోపించారు. వెర్గిడ్ అడ్రస్ లేని ఓటర్లు వేలల్లో ఉన్నట్టు మీడియాలో కథనాలు వచ్చాయన్నారు. ఇది ఓట్ల దొంగతనం కాదా? అని ప్రశ్నించారు. ఆ కారణంగానే తాము మెషీన్ రీడబుల్ డిజిటల్ ఓటర్ల జాబితాను, సీసీటీవీ ఫుటేజ్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు.

## ప్రతిష్టాత్మకంగా ఉజ్జయిని మహంకాళి బోనాలు

(మొదటి పేజీ తరువాయి)



లేకపోతే విజయవంతం కాదన్నారు. గత సంవత్సరం ఏమైనా పొరపాటు జరిగితే సమీక్షించుకుని మరిన్ని ఏర్పాట్లు చేయడానికి ఈ సమీక్ష ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవాలయ ఏర్పాట్ల కోసం భాగస్వామ్యం అవుతున్న అందరికీ అభినందనలు తెలియజేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సికింద్రాబాద్ చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు నిర్వహిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జులై 13న ఉజ్జయిని మహంకాళి బోనాల నేపథ్యంలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల సమన్వయంతో ప్రజలందరి సహకారంతో బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి కోరారు. రాజకీయాలకు అతీతంగా అమ్మవారి బోనాలు నిర్వహించుకోవాలన్నారు. గతేడాది ప్రభుత్వం తరఫున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఘనంగా బోనాలు నిర్వహించామని గుర్తు చేశారు. బోనాల ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బోనాలతో వచ్చే మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తూ, ప్రభుత్వ పరంగా అన్ని శాఖల అధికారులను సమాయత్తం చేస్తున్నట్లు తెలిపారు. ఆలయం లోపల కేబుల్ వైర్‌లు కొత్తవి వేసి ఇబ్బందులు, ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. భారీ కెడింగ్ జాలి ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఆతిథ్యం ఇవ్వడంలో హైదరాబాద్ నగర ప్రజలు ఎవరికీ తీసిపోరన్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు స్థానిక హైదరాబాద్ ప్రజలు వారి ఆతిథ్యం ఇవ్వాలన్నారు. ఒక్కో వారం ఒక్కో ఏరియాలో పండుగ జరుగుతుంది కాబట్టి ఆయా ప్రాంతాల్లో వాటర్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని.. అవసరమైతే రెండుసార్లు నీటిని ఇవ్వాలని ఆదేశించారు. హైదరాబాద్ మొత్తం ఒకేసారి పండుగ జరిగితే కొంత ఇబ్బంది ఉంటుందని.. కానీ ఒక్కో వారం ఒక్కో ఆలయంలో ఉంటుందని, భద్రత విషయంలో పోలీసులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అమ్మవారి ఆశీర్వాదం ఉండాలని.. ప్రభుత్వ పరంగా అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. 3600 దేవాలయాలకు సంబంధించి సమీక్ష రాష్ట్ర స్థాయి అధికారులతో జరిగిందని తెలిపారు. గోల్కొండ, ఉజ్జయిని మహంకాళి, బల్కంపేట, లాల్ దర్వాజా ఇలా ఒక్కో వారం ఒక్కో ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయని.. జోగిని వాళ్ళకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు. తమకు బోనం ఎత్తుకునే వారే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. బోనాల సమయంలో కాకుండా రద్దీ తక్కువ ఉన్న సమయంలో వీఐపీ వస్తే ఇబ్బందులు ఉండవన్నారు. ఉజ్జయిని మహంకాళి బోనాలు చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉండాలని తెలిపారు. డెక్కన్ మానవ సేవ సమితి, ఇతర సంస్థలు ఇక్కడ చాలా సేవ కార్యక్రమాలు చేస్తున్నాయన్నారు. అందరూ వారి సహకారం అందించి ఉత్సవాల్లో భాగస్వామ్యం కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే తలసాని, జిల్లా కలెక్టర్ హరిచందన, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నామని గుర్తు చేశారు. ఈ పథకం కింద 42.16 లక్షల మంది రైతులకు భీమా అందించామని స్పష్టం చేశారు.రాష్ట్రంలో రూ.22వేల కోట్ల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఒక్కో అసెంబ్లీ స్థానంలో 3వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడాతూ.. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. 'రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ. 10లక్షల వరకు వైద్య సదుపాయం అందిస్తు న్నాం. దీంతో 94లక్షల కుటుంబాలు లబ్ది పొందుతున్నాయి. రూ.6వేల కోట్ల విలువైన 189 కోట్లు ఉచిత బస్సు టికెట్లు ఇచ్చాం. మొదటి సంవత్సరం 58 పాఠశాలలు నిర్మించేందుకు 11,600 కోట్లు కేటాయించాంరాష్ట్రంలోని 3.10 కోట్ల మంది పేదలకు ఉగాది నుంచి సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. సన్న బియ్యం కోసం ప్రతి సంవత్సరం 13,525 కోట్లు ఖర్చు చేస్తుంది. రాష్ట్రంలోని సాగునీటి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. ఇందుకుగాను తాజా బ్జడెట్లో 23,373 కోట్లు కేటాయించాం.' అని భట్టి వ్యాఖ్యానించారు.

## విజయోత్సవాలు కాదు.. రైతులకు క్షమాపణ చెప్పాలి: హరీష్ రావు

(మొదటి పేజీ తరువాయి)

రైతులను మోసం చేయడమే అని పేర్కొన్నారు. చెప్పింది కొండంత, చేసింది గోరంత అని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో రైతులను మభ్య పెట్టావు అధికారంలోకి వచ్చాక నిండా ముంచావు.. రైతులకు ఏం చేశావని సంబరాలు చేస్తున్నావు అని సిఎం రేవంత్ రెడ్డిని అడిగారు.రెండు సీజన్ల రైతు భరోసా ఎగ్గొట్టినందుకా%ొ%కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వనందుకా..రైతు కూలీలందరికి ఆత్మీయ భరోసా అని ఇవ్వకుండా మోసం చేసినందుకా..రుణమాఫీ చారణ చేసి బారాణ మందిని మోసం చేసినందుకా..అన్ని పంటలకు బోనస్ అని, సన్నాలకే పరిమితం చేసినందుకా..1200 కోట్ల బోనస్ డబ్బులు చెల్లించినందుకా%ొ%ప్రీమియం చెల్లించక రైతు బీమా అమలు ప్రశ్నార్థకం చేస్తున్నందుకా..పంట బీమా అని చెప్పి ఉసురుమనిపించినందుకా%ొ%దేశానికి అన్నం పెట్టే రైతన్నలపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేసినందుకా..లగచర్ల, రాజోలి రైతుల చేతులకు బేడీలు వేసినందుకా%ొ%ఏడాదిన్నర పాలనలో ఒక్క చెరువు నింపకుండా, ఒక్క చెక్ డ్యాం కట్టకుండా, కొత్తగా ఒక్క ఎకరాకు నీళ్ళు ఇవ్వనందుకా..ధాన్యం కొనుగోళ్ళు సక్రమంగా జరపనందుకా..జనుము, జీలుగు విత్తనాల ధరలు పెంచి, రైతులకు సకాలంలో అందించినందుకా.. వరంగల్ రైతు డిక్లరేషన్‌ను అటకెక్కించినందుకా%ొ%మీ దుర్మార్గ పాలనలో 511 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నందుకా.. అంటూ సిఎం రేవంత్‌రెడ్డికి ప్రశ్నల వర్షం కురిపించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు రైతుల బతుకులు సంక్షోభంలో కూరుకుపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పాలనలో ఎలాంటి ఆందోళన లేకుండా ఉన్న రైతన్న నేడు ప్రభుత్వ పథకాలు అందక పంట పొలాల్లోనే కుప్ప కూలుతున్నారని వాపోయారు. బిఆర్ఎస్‌ది రైతు సంక్షేమ ప్రభుత్వం అయితే, కాంగ్రెస్‌ది రైతు సంక్షోభ ప్రభుత్వం అని పేర్కొన్నారు

## వీరభద్రం ని పరామర్శించిన తల్లాడ ప్రెస్ క్లబ్ సభ్యులు



**వైరా/జూన్24(జర్నలిస్ట్ వార్త):** వైరా డివిజన్ సిపిఎం కార్యదర్శి భూక్య వీరభద్రం ని మంగళవారం తల్లాడ ప్రెస్ క్లబ్ సభ్యులు పరామర్శించారు. ఈనెల 17వ తేదీన మోటార్ సైకిల్ మీద నుండి క్రిందపడి కాలుకు గాయమైన సిపిఎం వైరా డివిజన కార్యదర్శి భూక్య వీరభద్రం , ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని ఇంటిదగ్గర విశ్రాంతిని తీసుకుంటున్న విషయము తెలుసుకొని జర్నలిస్ట్ వార్త ఖమ్మం జిల్లా బ్యూరో నారపోగు ప్రసాద్ వైరా వీరభద్రం గృహానికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ప్రజా పోరాటాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారి వెంట సిపిఎం జిల్లా నాయకులు ఎర్ర శ్రీనివాసరావు మెరుగు సత్యనారాయణ ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు



**గణపురం/జూన్24(జర్నలిస్ట్ వార్త):** గణపురం మండల కేంద్రంలో ని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బత్తిని శివశంకర్ గౌడ్ భూపాలపల్లి జిల్లా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.కాంగ్రెస్ పార్టీ లొ చేరిన వారు టిబిజి కే స్ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గణపురం మండల మాజీ అధ్యక్షుడు యూత్ నాయకులు జి .రామకృష్ణగౌడ్, ఆర్ శ్రీకాంత్, ఎం నిఖిల్, కే. వికాస్ గౌడ్, ఎన్. అరవింద్, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ వైస్ చైర్మన్ దూడపాక శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

# రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**సీఎం రేవంత్ రెడ్డి -18 నెలల కాలంలో రైతుల సంక్షేమానికి లక్షా 4 వేల కోట్ల రూపాయలు**

**-రైతు భరోసా విజయోత్సవ సభ కార్యక్రమానికి కూసుమంచి రైతు వేదిక నుంచి హాజరైన జిల్లా కలెక్టర్**







**ఖమ్మం బ్యూరో/జూన్24(జర్నలిస్ట్ వార్త):** రైతును రాజు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లో మంగళవారం ఏర్పాటు చేసిన రైతు విజయోత్సవ సభ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు, ఇతర మంత్రులు, సీఎస్ కె. రామకృష్ణారావు లతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హాజరయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 70 లక్షలకు పైగా రైతులకు కోటి 49 లక్షల పైగా ఎకరాలకు ప్రభుత్వం 9 రోజుల వ్యవధిలో 9 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా నిధులు జమ చేసిన నేపథ్యంలో ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టానని, అండగా నిలిచిన తెలంగాణ రైతాంగానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భూమి కోసం భుక్తి కోసం రైతాంగ పోరాటాలు జరిగాయని, భూమి చుట్టూ మన జీవితం ముడిపడి ఉందని అన్నారు. వ్యవసాయం దండగ పరిస్థితి నుంచి వ్యవసాయం పండుగ చేయాలని గతంలో డాక్టర్ వైయస్సార్ నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వం రైతులకు ఉచిత విద్యుత్తు అందించడంతో పాటు పెండింగ్ విద్యుత్ బకాయిలను రద్దు చేసిందని అన్నారు. ప్రజా ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత రైతాంగం మాత్రమేనని, రైతులు, మహిళలు, తెలంగాణ ఉద్యమ కారులు, విద్యార్థులే తమ ప్రాధాన్యత అని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు 25 లక్షల 35 వేల 964 మంది రైతులకు 20 వేల 617 కోట్ల రూపాయలు వారి ఖాతాలలో జమ చేసి రెండు లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేసి దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజున రైతులను రుణ విముక్తి చేశామని అన్నారు. కొనుగోలు ప్రభుత్వ పరిధిలోని అంశం కాదని గత పాలకులు బాధ్యత నుంచి తప్పుకుంటే, ప్రజా ప్రభుత్వం రైతులు పండించిన చివరి గింజ వరకు మద్దతు ధరపై కొనుగోలు చేయడమే కాకుండా సన్న వడ్లకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ చెల్లించిందని అన్నారు.

ప్రజా ప్రభుత్వం అందించిన భరోసా మేరకు తెలంగాణ రైతాంగం వరి పండించడంలో పంజాబ్, హర్యానా రాష్ట్రాలను దాటిందని, 2 కోట్ల 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించిందని, గతంలో తాళ్ల పేరుతో రైతులకు 10 కిలోల వరకు కటింగ్ చేసే వారని, నేడు ఆ దోపిడీని తమ ప్రభుత్వం పూర్తిగా నిలువరించిందని, రైతులకు మద్దతు ధర 48 గంటల్లో జమ చేస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత మొదటి సంవత్సరంలోనే 60 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని అన్నారు. 18 నెలల కాలంలో రైతుల సంక్షేమానికి లక్షా 4 వేల కోట్ల కోట్ల రూపాయలను ప్రజా ప్రభుత్వం ఖర్చు చేసిందని, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఇందిరా మహిళ శక్తి కార్యక్రమం క్రింద క్యాంటీన్, పెట్రోల్ బంక్, రైస్ మిల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి, ఆర్టీసీ సంస్థలో అద్దె బస్సులు వంటి అనేక వినూత్న వ్యాపారాలను మహిళలతో ప్రారంభిస్తున్నామని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. మహిళలకు మొదటి సంవత్సరం 21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించామని, హైదరాబాదులో శిల్పారామం దగ్గర నాలుగు ఎకరాల స్థలం కేటాయించి మహిళా స్వయం సహాయక సంఘాలు ఉత్పత్తి చేసే వస్తువులు అమ్మకానికి షాపులు ఏర్పాటు చేశామని, ప్రభుత్వ పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల చేతిలో పెట్టామని, ఏక రూప దుస్తులను మహిళా సంఘాలతో కుట్టిస్తున్నామని అన్నారు. గోదావరి, కృష్ణా నది జలాలపై చర్చకు ప్రతిపక్ష నాయకులు ముందుకు రావాలని, అసెంబ్లీలో చర్చకు స్పీకర్ కు లేఖ రాస్తే వెంటనే శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి అసెంబ్లీను సమావేశ పరుస్తారని అన్నారు. రైతును రాజు చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని, రాబోయే రోజుల్లో రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేస్తామని అన్నారు.

**డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ**

9 రోజులలో 9 వేల కోట్ల రూపాయలను 70 లక్షల రైతుల ఖాతాలో జమ చేయడం దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన గొప్ప కార్యక్రమం అని, వ్యవసాయానికి ఉచిత కరెంట్, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించాలని మద్దతు ధర, బ్యాంకుల ద్వారా ప్రయార్టీ సెక్టార్ క్రింద రైతులకు రుణాలు పంపిణీ చేయడం, హరిత విప్లవం వంటి అనేక కార్యక్రమాలను ప్రవేశపెట్టామని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. రైతు పక్షపాతిగా తమ ప్రభుత్వం పని చేస్తుందని, ఇందిరమ్మ ప్రభుత్వం 21 వేల కోట్ల రుణ మాఫీ చేసిందని, రైతు కూలీలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా క్రింద 12 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తున్నామని అన్నారు. గత పాలకులు రైతులకు అందించే డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ, మద్దతు ధర, బోనస్, వడ్డీ లేని రుణాలు, పంట నష్టపరిహారం వంటి అనేక సంక్షేమ పథకాలను రద్దు చేసి కేవలం అరకొర రైతు బంధు కార్యక్రమం నిర్వహించిందని, తమ ప్రభుత్వం రైతు భరోసా పథకం అమలు చేస్తూనే మిగిలిన సంక్షేమ కార్యక్రమాలను కూడా చేపట్టిందని అన్నారు.

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ**

దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు సంక్షేమ కార్యక్రమాలను తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలు చేస్తున్నామని, మన పథకాలను ఇతర రాష్ట్రాల పాలకులు పరిశీలిస్తున్నారని, రైతాంగం అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని రాజీవ్ గాంధీ సూచనల మేరకు ఉత్తమ పాలన సాగుతుందని అన్నారు. రైతు భరోసా నిధులు జమ అయ్యాయని తెలంగాణ రైతాంగం చేసుకుంటున్న సంబరాలలో తాము భాగస్వామ్యం అవుతున్నామని అన్నారు. 25 లక్షల మంది రైతులకు తెలంగాణ రాష్ట్రంలో 21 వేల కోట్ల రూపాయల ఖర్చు చేసి 2 లక్షల వరకు పంట రుణ మాఫీ పూర్తి చేశామని మంత్రి గుర్తు చేశారు. పంట కాలానికి పెట్టుబడి సహాయం అందించాలనే లక్ష్యంతో 9 రోజులలో 9 వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాలలో జమ చేశామని, దీనికి సహకరించిన ఆర్థిక శాఖ మంత్రివర్యులు డిప్యూటీ సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి రైతు వేదిక నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి రైతు వేదిక లోని రైతులనుద్దేశించి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 3 లక్షల 53 వేల మంది రైతులకు 430 కోట్ల రైతు భరోసా నేటితో పూర్తయిందని, రైతుకు పెట్టుబడి సహాయం అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

రైతు భరోసా సహాయంతో పాటు వ్యవసాయం లాభసాటిగా జరగాలని అన్ని రకాల మద్దతు ప్రభుత్వం రైతులకు అందిస్తుందని, అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ఎక్కడైనా రైతులకు ఎటువంటి సమస్యలు వచ్చినా మండల అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి దృష్టికి తీసుకొని రావాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో వానాకాలం దాదాపు 6 లక్షల 7 వేల ఎకరాల పంట సాగు జరుగుతుందని, దీనికి అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో పెట్టామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సరిత, మండల వ్యవసాయ అధికారిణి అనురాధ, వ్యవసాయ విస్తరణ అధికారి సరిత, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## అనాధ పిల్లలతో కలిసి

**జన్మదిన వేడుకలు జరుపుకున్న పరుపాటి**



**రాయపర్తి/జూన్ 24(జర్నలిస్ట్ వార్త):** పేదల పాలిట పెన్నిధి,ఎందరో అనాధలను అక్కున చేర్చుకుని, నియోజకవర్గ ప్రజలకు నిరంతరం సేవలందిస్తూ, ప్రజాధైనందిక జీవితంలో ఘనదైన ముద్ర వేసుకొని మానవత మూర్తిగా ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ గొప్ప మానవతా విలువలు కలిగిన ప్రజానాయకుడిగా కీర్తిగడించిన మండలంలోని మైలారం గ్రామానికి చెందిన ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్,బి ఆర్ ఎస్ జిల్లా నాయకులు పరు పాటి శ్రీనివాస్ రెడ్డి తన జన్మదిన వేడుకలను హైదారాబాద్ లోని ఆలేటి ఆటం అనాధ ఆశ్రమంలో సుమారు 200 మంది అనాధ పిల్లలతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారికి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడంతో పాటు 20000 రూపాయలు ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలు ఆలేటి ఆటం అనాధాశ్రమంలో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూక్యా సురేందర్ రాథోడ్,తదితరులు పాల్గొన్నారు.

## ఒంగోలు త్రిబుల్ ఐటీ లో సీట్ సాధించిన టాలెంట్ స్కూల్ విద్యార్థి షేక్ పర్వీన్

**సత్తుపల్లి/జూన్ 24(జర్నలిస్ట్ వార్త):**



వెలువడిన ఆంధ్రప్రదేశ్ త్రిబుల్ ఐటీ ఫలితాలలో స్థానిక సత్తుపల్లి టాలెంట్ స్కూల్ విద్యార్థి షేక్ పర్వీన్ ( అప్లికేషన్ నం ఆర్ జి యు 25037065)ఒంగోలు త్రిబుల్ ఐటీ కళాశాలలో సీట్ సాధించడం జరిగిందని టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు.. ఈ కార్యక్రమంలో టాలెంట్ స్కూల్ కరెస్పాండెంట్ పులి శ్రీనివాసరావు. మాట్లాడుతూ మా విద్యార్థి షేక్ పర్వీన్ నర్సరీ నుంచి 10వ తరగతి వరకు టాలెంట్ స్కూల్లో చదివి 2025 10వ తరగతి ఫలితాల్లో 572 మార్కులు సాధించి, ఈరోజు వెలువడిన త్రిబుల్ ఐటీ ఫలితాలలో ఒంగోలు కళాశాలలో సీటు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టాలెంట్ స్కూల్ యాజమాన్యం మరియు ఉపాధ్యాయ బృందం ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు

**కలెక్టర్ అనుదీప్**



**ఖమ్మం/జూన్ 24(జర్నలిస్ట్ వార్త):** సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.మంగళవారం కలెక్టరేట్లో అదనప కలెక్టర్లు డాక్టర్ పి శ్రీజ, శ్రీనివాస్ రెడ్డి తో కలిసి సీజనల్ వ్యాధుల నియంత్రణ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి కళావతి భాయి వివరించారు.డెంగ్యూ లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి టెస్టులు చేయాలి. కలెక్టర్. వర్షాకాల సీజన్ ఆరంభం అయిన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. అదేవిధంగా డెంగ్యూ శాంపిల్స్ టెస్టింగ్ విస్తృతంగా చేయాలని జిల్లా వైద్యాధికారులను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. డెంగ్యూ లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఆసుపత్రులలో టెస్టులు చేయాలన్నారు. ప్రతి ఏరియా ఆసుపత్రి, పి హెచ్ సి ల వద్ద అవసరమైన కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రజలు ఇళ్లల్లో ఉన్న పాత కూలర్లు, కొబ్బరి బోండాలు, కుండలు పాత టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

## ప్రైవేట్ పాఠశాల నిర్వహిస్తున్న బుక్స్ గోడౌన్ సీజ్



**సత్తుపల్లి/జూన్24(జర్నలిస్ట్ వార్త):** ఎలాంటి అనుమతులు లేకుండా పుస్తకాలు విక్రయిస్తున్న సత్తుపల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశాల బుక్స్ గోడౌన్ సీజ్ చేసినట్లు ఎంఈఓ రాజేశ్వరరావు తెలిపారు. మంగళవారం అమ్మకాలు చేస్తున్నారని ఫిర్యాదు మేరకు సీజ్ చేసినట్లు ఏఐఎస్ఎఫ్ ఖమ్మం నాయకులు తెలిపారు. పేద ప్రజలపై ప్రైవేటు విద్యాలయాలు ఫీజుల భారం మోపుతున్నారని అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నిన్న ఇదే విషయమై పాఠశాల సందర్శించిన ఏఐఎస్ఎఫ్ నాయకులు పాఠశాల ముందు నిరసన తెలియజేశారు తర్వాత ఎంఈఓ ఫిర్యాదు చేయగా పాఠశాల గోడౌన్ సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు పాల్గొన్నారు. అయితే ఇంకా మరికొన్ని స్కూల్లో కూడా ఇలాంటి సంఘటనలే జరుగుతున్నాయి. దాదాపు మరికొన్ని స్కూల్స్ లోనూ ఇదే తంతు నడుస్తుంది. కావున విద్యాశాఖ అధికారులు మిగతా స్కూల్స్ పై దృష్టి పెట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. మరి కొన్ని కార్పొరేట్ అని చెప్పుకుంటున్న స్కూల్స్ కూడా యూనిఫాం, బుక్స్, టై, బెల్ట్, షూస్ అమ్ముతున్నారని స్కూల్లో వాటికి బయట మార్కెట్లో వాటికి మధ్య రేట్ల విషయంలో తేడాలు ఉన్నాయని అంటున్నారు. అదేవిధంగా ప్రైవేట్ స్కూల్స్ లో ఫీజుల మధ్య కూడా చాలా వ్యత్యాసాలు ఉంటున్నాయని, చెప్పే చదువు జానెడు అయితే వసూలు చేసే ఫీజు మూరెడు ఉంటుందని ఈ విషయమే దృష్టి పెట్టి తల్లిదండ్రుల ఆర్థిక భారాన్ని తగ్గించవలసిందిగా కోరుతున్నారు. అంతేకాకుండా విద్య సంవత్సరం ఆరంభం లోనే విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ పాఠశాలలు సందర్శించి అన్ని రకాల తనిఖీలు చేసి నిబంధనలు ప్రకారం నడిచేలా చూడాలని పలువురు తల్లి దండ్రులు, విద్యావేత్తలు కోరుతున్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన




**పర్వతగిరి/జూన్ 24(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని ఆర్డిఎఫ్ కల్లెడ స్కూల్లో యాంటీ డ్రగ్ అవేర్నెస్ ప్రోగ్రాం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మామునూరు ఏసిపి ఎన్ వెంకటేష్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. ఒకసారి డ్రగ్స్ అలవాటయితే అదొక వ్యసనంగా మారుతుందని, జీవితంలో కోలుకోలేని విధంగా దెబ్బతింటారని అన్నారు. అనంతరం మాదకద్రవ్యాల వ్యతిరేక పోస్టర్ ను విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి సీఐ బి. రాజగోపాల్, ఎస్సై బి. ప్రవీణ్, ఆర్డిఎఫ్ ప్రిన్సిపల్ జనార్ధన్, కరస్పాండెంట్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి



**పర్వతగిరి/జూన్ 24(జర్నలిస్ట్ వార్త):** మదర్ తెరిస్సా మండల సమాఖ్య 19 వ వార్షిక మహా సభ సమావేశం మంగళవారం మండల కేంద్రంలో ని ఎంపీడీఓ సమావేశ మందిరం లో నిర్వహించారు. ఈ సమావేశానికి డీపీఎం ఐబీ దయాకర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే అన్ని రంగాల్లో రాణిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఐబీ వేణుగోపాల్ రావు, ఏ పీ ఎం కృష్ణమూర్తి, మే స్ ఈ సి మెంబర్స్, సీసీ లు, మాస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా రమేష్ పుట్టినరోజు వేడుకలు



**ఖమ్మం బ్యూరో/జూన్24(జర్నలిస్ట్ వార్త):** బజాప ఖమ్మం జిల్లా కార్యాలయములో సోమవారం రాత్రి భారతీయ జనతా పార్టీ నాయకులు ఈ వి రమేష్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు శ్రీ నెల్లూరి కోటేశ్వరరావు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. కేకు కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ రమేష్ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రులు బండి సంజయ్ ప్రధాన అనుచరులుగా ప్రజా చైతన్య యాత్ర ప్రముఖులుగా వారు చేసిన పాదయాత్రలో వెంట ఉండి పర్యవేక్షించినటువంటి నాయకుడని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి మన జిల్లా వాసికావటం మనందరి సౌభాగ్యమని తెలిపారు. విద్యా సంస్థల అధిపతి అని ఎందరో పేద విద్యార్థుల జీవితంలో వెలుగు నింపిన నాయకులని కొనియాడారు. ఖమ్మం జిల్లాలో బాజాప ఎదుగుదలకు అహర్నిశలు కృషి చేస్తున్నారని వారు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నానని తెలిపారు. అనంతరం తల్లాడ మండల బాజాపా నాయకుల బృందం ఈవి రమేష్ ని శాలువలతో సత్కరించి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలియపరచినారు ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి నున్న రవికుమార్ కార్యదర్శి మున్నా మిశ్రా మందా సరస్వతి తల్లాడ మండల నాయకులు మండల ప్రధాన కార్యదర్శి పెరిక కిరన్ గౌడ్ కార్యదర్శిలు తమ్మిశెట్టి కృష్ణ చల్ల నరేష్ సమ్మెట రాంబాబు రుద్ర గాని మాధవ్ రుద్ర ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# సి ఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం






**తల్లాడ/జూన్24(జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం మల్లవరం గ్రామంలో రైతు వేదిక ప్రాంగణంలో తల్లాడ మండల కిసాన్ సెల్ అధ్యక్షులు యర్రీ కృష్ణారావు ,ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి కి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గానికి సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్ చిత్రపటాలకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేసిన సందర్భంగా రైతు సంబరాలను ఘనంగా నిర్వహించి వారి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేసిన అనంతరం తల్లాడ మండల కిసాన్ సెల్ అధ్యక్షులు యర్రీ కృష్ణారావు , మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో తొలిసారి కేవలం 9 రోజుల్లోనే రూ. 9 వేల కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేసి, రాష్ట్ర రైతులకు పెద్ద ఊరటను అందించిన ఘనత ఇందిరమ్మ ప్రజాప్రభుత్వానిదే. తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి ఎకరాకు 12,000 ,రైతు భరోసా, 1.49 కోట్ల ఎకరాలకు నిధుల విడుదల రైతులకు ఉచిత కరెంట్ ,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,?2 లక్షల రుణమాఫీ ,సబ్సిడీ గ్యాస్ సన్న బియ్యం ,ఇలా మరెన్నో సంక్షేమ పథకాలు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుంది. అని మన ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం నిత్యం శ్రమిస్తున్న ఇందిరమ్మ ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు ఎల్లపుడు ఉండాలని తల్లాడ మండల కిసాన్ సెల్ అధ్యక్షులు యర్రీ కృష్ణారావు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు వేదికలో అనుసంధాన ప్రారంభోత్సవ కార్యక్రమంలో తల్లాడ తహసిల్దార్ సురేష్ బాబు ఆర్యలు, మండల ఉన్నత అధికారులు, ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు కటికి కిరణ్ కుమార్, యర్రి నరసింహారావు,సొసైటీ డైరెక్టర్ గోవింద శ్రీను,భూక్య అంజయ్య , పడాల రత్తయ్య మల్లవరం రైతు సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శనీయము

**-మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోట్రు అర్జున్ రావు.**





**కల్లూరు/జూన్24(జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతులకి భరోసా కలిగించే పార్టీ అని, నేడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శనీయమని మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోట్రు అర్జున్ రావు అన్నారు. మంగళవారం ముచ్చవరం రైతు వేదికలో రైతు భరోసా నిధుల విడుదలకు కృతజ్ఞతగా స్థానిక ఎమ్మెల్యే మట్ట రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ మంగళవారం రాష్ట్ర చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ రోజు అని అన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా నిధులను విడుదల చేసిందని అన్నారు. ఇప్పటి వరకు 1కోటి 49 లక్షల 39 వేల 111 ఎకరాలకు రైతు భరోసా అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదనిఅన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయాన్ని అందించి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముచ్చవరం క్లస్టర్ ఏ ఈ ఓ పవన్ కళ్యాణ్, పెద్ద కోరుకొండి క్లస్టర్ ఏఈఓ వెంకటలీల, గ్రామ సెక్రెటరీ శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఏఈ, ఏ ఎల్ ఎం, రైతులు దేవరపల్లి శ్రీనివాసరావు, పాములపాటి మురళి, పాములపాటి వెంకటేశ్వరరావు, కిలారి శ్రీనివాసరావు, రాయి కృష్ణయ్య, నామ సతీష్, సామినేని హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

# అంది వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని ఆకాశమే హద్దుగా ఎదగాలి



**ఆదిత్య యాదవ్ మాదర బోయిన**



**ధర్మసాగర్/జూన్24(జర్నలిస్ట్ వార్త):** అంది వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని ఆకాశమే హద్దుగా ఎదగాలని ఆదిత్య యాదవ్ మాదర బోయిన. అన్నారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ధర్మసాగర్ గ్రామ దివంగత ఉపాధ్యాయులు సత్యనారాయణ రాజు స్మారకార్థం "మోటివేషనల్ టాక్' ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు, ధర్మ ప్రకాష్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సులో కీలక ఉపన్యాసం చేసిన ఆదిత్య యాదవ్ మాట్లాడుతూ , ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు వారి ఎదుగుదలకు ఎన్నెన్నో అవకాశాలు వస్తున్నాయి. వాటిని అందిపుచ్చుకొని ఆకాశమే హద్దుగా ఎదగాలి. కృత్రిమ మేధా అనేది సాంకేతిక రంగంలో ఒక విప్లవం. ఇది ప్రయోగశాల స్థాయి దాటి మానవ నిత్య జీవిత సమస్యల పరిష్కారానికి ఉపయోగపడుతున్నది . విద్య ద్వారానే మంచి జీవనశైలి, విద్యార్థుల ప్రగతి సాధ్యం. చదువుతోపాటు ఆటలు, సాహితీ ,సాంస్కృతిక కార్యక్రమాల్లో పాలుపంచుకున్నట్లయితే చురుకుగా ఉంటారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేందుకు కొత్త వ్యూహాలు అవసరం. విశ్లేషణాత్మక ఆలోచనలతో ముందుకెళ్లాలి. అందుకు విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి తాను ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ . రాజు గారి కుమారుడు బిరుదరాజు రాము, లలిత్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. విద్యార్థుల ఉపయోగార్థంగా సోషల్ అండ్ స్టూడెంట్ యాక్టివిస్ట్ ఆదిత్య యాదవ్ బృందం చేషటిల్ రాకెట్స్, బోర్డులు ,షటిల్ నెట్స్ ,షటిల్ కాక్స్ లాంటి క్రీడా సామాగ్రిని పాఠశాలకు వితరణ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవితా దేవి, సురేష్, పద్మజ, కిరణ్ మై, రామకృష్ణ ,రమ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా తో రైతుల్లో ఆనందం



**పర్వతగిరి/జూన్24(జర్నలిస్ట్ వార్త):** రైతు భరోసా తో రైతుల్లో ఆనందం నెలకొందని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది రోజులలో 9వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాలలో జమ చేసిన సందర్భంగా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో 9రోజుల్లో 70లక్షల రైతుల ఖాతాల్లో 9వేల కోట్ల రూపాయలను జమ చేసి రైతులకు పంట పెట్టుబడి సాయం అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వం అని అన్నారు...రైతు సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అని అన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డికి,ఎంఎల్ఏ కె.ఆర్ నాగరాజ్ కి,ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకి,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి, యూత్ కాంగ్రెస్ ప్రక్షాళ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హామ్యా నాయక్.**



**రాయపర్తి/జూన్24(జర్నలిస్ట్ వార్త):** రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్ అన్నారు.వానాకాలం పెట్టు బడి సాయం రైతు భరోసా అందించిన సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంతోనే రైతుల ఆశయాలు నెరవేరుతాయని అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ఏకకాలంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా చారిత్రాత్మకంగా రెండు లక్షల రుణమాఫీ చేసినా ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతుల ఆర్థిక అభివృద్దే ద్వేయంగా పని చేస్తుందనీ అన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఏఎంసి వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి,మండల పార్టీ ఉపాధ్యక్షుడు వల్లపు కుమార్,ఎంపీటీసీ కో-ఆర్డినేటర్ ఉల్లేంగుల యాదగిరి,రాయపర్తి పట్టణ అధ్యక్షులు మచ్చ రమేష్,యూత్ అధ్యక్షుడు కళ్యాణ్ గౌడ్,కంధీకట్ల రాజయ్య,రెంటాల గోవర్ధన్ రెడ్డి, నంగునూరి అశోక్,ఎండీ ఉస్మాన్, చిర్ర మల్లయ్య,మాందాటి సుదర్శన్ రెడ్డి, గారే బిక్షపతి,నర్సింహ మూర్తి,గుగులోత్ యాకుబ్,ఎండీ గౌస్ ఖాన్,ఐత సాంబయ్య,కోతి వీరయ్య,తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

**- చీఫ్ ఇంజనీర్ రాజ్ చౌహాన్**



**రాయపర్తి/జూన్ 24(జర్నలిస్ట్ వార్త):** వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ లక్ష్యమని చీఫ్ ఇంజనీర్ రాజ్ చౌహన్ మంగళవారం మండలోని సన్నూరు గ్రామ సబ్ స్టేషన్ నుండి ఊకల్ సబ్ స్టేషన్ వరకు కొత్తగా నిర్మించిన 33 కెవి లైన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరా లో అంతరాయాలను నివారించడానికి కొత్తగా 33 కెవి ఇంటర్ లింకింగ్ లైను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. సన్నూరు, ఊకల్ గ్రామాల సబ్ స్టేషన్ లలో విద్యుత్ అంతరాయాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా కొరకు సబ్ స్టేషన్, కొత్త లైన్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ లో పవర్ ట్రాన్స్ఫార్మర్ 5 MVA సంపూర్ణ మరమ్మత్తులు పూర్తి చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ ఇంజనీర్ గౌతమ్ రెడ్డి,ఆపరేషన్ డిఇ బిక్షపతి, కన్స్ట్రక్షన్ డిఇ హరి జి నాయక్,ఏఈ కన్స్ట్రక్షన్ రాజశేఖర్, ఏఈ రవళి,తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసాపండుగ హర్షం వ్యక్తం చేసిన తల్లాడ మండల కిసాన్ సెల్ అధ్యక్షులు యర్రీ కృష్ణారావు



**తల్లాడ/జూన్24(జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అండగా రైతులకు రైతు భరోసాపండుగలా ఉందని తల్లాడ మండల కిసాన్ సెల్ అధ్యక్షులు యర్రీ కృష్ణారావు అన్నారు. రైతులపక్షపతిగా ఉనందుకుహర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా డబ్బులను గత సోమ వారం నుంచి అకౌంట్లలో జమ చేస్తోంది. ఇవాళ ఏకంగా 15 ఎకరాల వరకూ ఉన్న రైతులకు డబ్బు జమ చేసింది. అందువల్ల 15 ఎకరాలు ఉన్న రైతులకు ఎకరానికి 6వేల చొప్పున మొత్తం రూ.90,000ను అకౌంట్లలో జమ చేసింది. ఇందుకోసం రూ.513 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఇలా ఇప్పటివరకూ రూ.8,284 కోట్లను, 67.01 లక్షల మంది రైతుల అకౌంట్లలో జమ అయ్యాయి. ఈ నెల 24తో రైతు భరోసా డబ్బులను అందరు రైతుల అకౌంట్లలో జమ చెయ్యాలనేది కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుకున్న టార్గెట్ఆ ప్రకారమే ప్రతి రోజూ రైతులకు భరోసా నగదు జమచేస్తూ వస్తున్నారు. గత సోమవారం ఈ పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించినప్పుడు ముందుగా 1, 2 ఎకరాలు ఉన్న రైతులకు డబ్బును జమ చేశారు. ఆ తర్వాత క్రమంగా ఎకరాలను పెంచుతూ వచ్చారు. అందువల్ల రోజురోజుకూ పథకం ద్వారా లబ్ది పొందుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. 3 ఎకరాలు, 4 ఎకరాలు, 5 ఎకరాలు ఇలా 9 ఎకరాలు ఉన్న రైతుల అకౌంట్లలో శనివారం నాటికి డబ్బు జమ చేశారని తెలిపారు.

# ఎరువులు, విత్తన దుకాణాలపై పటిష్ట నిఘా

## -ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు



భూపాలపల్లి/జూన్24(జర్నలిస్ట్ వార్త):
ఎరువులు, విత్తన దుకాణాలపై పటిష్ట నిఘా ఉంచాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు అన్నారు.మంగళవారం హైదరాబాద్ సచివాలయం నుండి ఇందిరమ్మ ఇండ్లు, వన మహోత్సవం, సీజనల్ వ్యాధులు నియంత్రణ, టిబి ముక్త్ భారత్, వైద్య కళాశాల లు నిర్వహణ, భూ భారతి, ఎరువులు, విత్తనాలు లభ్యత తదితర అంశాలపై ఆయా శాఖల కార్యదర్శులతో అన్ని జిల్లాల కలెక్టర్లుతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2.34 ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణానికి లబ్ది దారులకు మంజూరు ఉత్తర్వులు జారీ చేశామని వాటిలో లక్షకు పైగా ఇండ్లు గ్రౌండింగ్ జరిగినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణానికి ఇసుక సమస్య రాకుండా అన్ని శాఖల అదికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.
వన మహోత్సవంలో ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రతి పట్టణంలో 500 మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని అన్నారు.
పెండింగ్ డబుల్ బెడ్ రూం ఇండ్లను లబ్దిదారుల ద్వారా పూర్తి చేయాలని సూచించారు.రైతులకు సమృద్ధిగా ఎరువులు, విత్తనాలు సరఫరాకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షా 25 వేల ఎకరాల ఆయిల్ పామ్ పంట సాగు విస్తీర్ణం పెంచాలని తెలిపారు.ఆగస్టు 15 నాటికి భూ భారతి రెవెన్యూ సదస్సుల క్రింద వచ్చిన దరఖాస్తుల పరిష్కారం చూపాలని పేర్కొన్నారు.ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వన మహోత్సవం కార్యక్రమం విజయవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కే. రామ కృష్ణా రావు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరయ్యారు. వన మహోత్సవం కార్యక్రమం, ఇందిరమ్మ ఇండ్ల, ఎరువుల లభ్యత, ఆయిల్ పామ్ పంట విస్తరణ, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు, భూ భారతి దరఖాస్తుల పరిష్కారం వంటి పలు అంశాల పై సీఎస్ సుదీర్ఘంగా చర్చించి పలు సూచనలు చేశారు. 2 లక్షల 30 వేల కు పైగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశామని, లక్షకు పైగా ఇండ్ల నిర్మాణ పనులు గ్రౌండ్ అయ్యాయని అన్నారు. వర్షాలు కురవడానికి ముందే మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్, బేస్మెంట్ స్థాయి వరకు నిర్మాణం జరిగేలా చూడాలని సీఎస్ సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని, సీనరేజి చార్జిలను ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పెండింగ్ పనులు లబ్ధిదారులు పూర్తి చేసుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. ప్రస్తుతం ఎంత మేరకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం జరిగిందో ఎంబీ రికార్డులను నమోదు చేసి లబ్ధిదారులకు ఇండ్లను కేటాయించాలని, ప్రభుత్వం మిగిలిన పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తుందని అన్నారు. పిఎం ఆవాస్ యోజన అర్బన్ 2.0 క్రింద మన రాష్ట్రానికి లక్షా 13 వేల ఇండ్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, ప్రతి పట్టణం నుంచి కనీసం 500 మంది నిరు పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కలెక్టర్ లకు సీఎస్ సూచించారు.
వన మహోత్సవం కార్యక్రమం క్రింద ఇండ్లకు పంపిణీ చేసే పండ్ల మొక్కల పెంపకం చేపట్టాలని, మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సీఎస్ కలెక్టర్ లకు సూచించారు. ప్రతి జిల్లా ప్రత్యేకమైన ప్రణాళికను సిద్ధం చేసుకుని వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించాలని, నాటిన మొక్కల వివరాలను



ఎప్పటికప్పుడు జియో కో-ఆర్డినేట్స్ తో ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. ప్రతి జిల్లాలో ఎరువుల లభ్యత స్టాక్ పై సమీక్ష పెట్టాలని అన్నారు. జూలై వరకు అవసరమైన స్టాక్ అందుబాటులో ఉందని, సెప్టెంబర్ నాటికి అవసరమైన ఎరువుల స్టాక్ సిద్ధం చేస్తున్నామని అన్నారు. ఎరువుల స్టాక్ ను ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు.
రిటైల్ విక్రయాలను డిజిటలైజ్ చేయాలని కలెక్టర్ లకు సీఎస్ సూచించారు. వ్యవసాయ సహకార సంఘాలు, ఎరువుల దుకాణాలలో కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.లక్షా 25 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగు ఈ సంవత్సరం విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. రైతులకు లాభసాటి పంట ఆయిల్ పామ్ పట్ల అవగాహన కల్పిస్తూ పంట విస్తరణకు చర్యలు తీసుకోవాలని అన్నారు.భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సుల ద్వారా 8 లక్షల 27 వేల దరఖాస్తులు వచ్చాయని, వీటిలో సాధా బైనామా, ఆర్ఓఆర్ సమస్యలు, పట్టాలో కరెక్షన్స్ వంటి వివిధ సమస్యల పై దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఆగస్టు 15 నాటికి ఈ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. సీజనల్ వ్యాధులు డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు జిల్లాల్లో పటిష్ట చర్యలు తీసుకోవాలని, కలెక్టర్ లు ప్రత్యేక శ్రద్ధ వహించి సీజనల్ వ్యాధుల నియంత్రణ పై అవగాహన కల్పన, పర్యవేక్షణ వంటి కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి లక్షణాలు గల ప్రతి ఒక్కరికి పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ జరిగిన వారికి అవసరమైన చికిత్స అందించాలని అన్నారు.
ఆన్ లైన్ నుంచి వీసి లో పాల్గొన్న అటవీ, పర్యావరణ శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ మాట్లాడుతూ, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించాలని అన్నారు. జిల్లాలో మంత్రులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున బాగస్వాములను చేయాలని అన్నారు. గతం కంటే మెరుగ్గా ప్రజల్లో వన మహోత్సవం కార్యక్రమాన్ని తీసుకెళ్ళాలని, ప్రతి రోజూ ఒక్కో శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించాలని అన్నారు. జిల్లాలో వి.ఐ.పి పర్యటనల సందర్భంగా తప్పనిసరిగా మొక్కలు నాటేలా చూడాలని అన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ లో పెద్ద మొక్కలు నాటి వాటి రక్షణకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అటవీ ప్రాంతంలో కోతులకు అవసరమైన పండ్ల మొక్కలను పెద్ద ఎత్తున బ్లాక్ ప్లాంటేషన్ లో నాటాలని అన్నారు. జిల్లాలకు కేటాయించిన వన మహోత్సవం లక్ష్యాలను కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక శ్రద్ధ వహించి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ భూ భారతి రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన 48651 దరఖాస్తులు ఆన్లైన్ చేయాలని అన్నారు. దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆగస్టు 15 నాటికి ప్రతి దరఖాస్తు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆ విధముగా కార్యాచరణ తయారు చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో పటిష్ట చర్యలు చేపట్టాలని అన్నారు. పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే కార్యక్రమాలు నిర్వహించి పరిసరాలు పరిశుభ్రం చేయాలని తెలిపారు. టిబి ముక్త్ భారత్ లో భాగంగా స్క్రీనింగ్ పెంచాలని, అనుమానితులకు ఎక్స రే లు తీసి లక్షణాలు బయట పడితే తక్షణం చికిత్సలు అందచేయాలని వైద్యులకు సూచించారు. సంప్రదాయ పంటలకు బదులుగా పామాయిల్ సాగు చేపెట్టేలా చర్యలు తీసుకోవాలని ఉద్యాన వన శాఖ అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో డిఎఫ్ఓ నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఎఎస్పీ నరేష్ కుమార్, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, డిఆర్డీఓ బాల కృష్ణ, ఉద్యానవన శాకాధికారి సునీల్ కుమార్, వ్యవసాయ శాఖ ఏడీఏ బాబు, ఆర్డిఓ రవి తదితరులు. పాల్గొన్నారు.

## రాజరాపు ప్రతాప్ పార్థివా దేహానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి





**ధర్మసాగర్/జూన్24(జర్నలిస్ట్ వార్త):** ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజరాపు ప్రతాప్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. కాజీపేట ఫాతిమా నగర్, సిద్దార్థ నగర్ లోని వారి స్వగృహానికి వెళ్లి రాజరాపు ప్రతాప్ పార్థివా దేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. దళిత, బహుజన వర్గాల సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని ఆవేదన వ్యక్తం చేశారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గారి వెంట స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## రైతు భరోన విజయోత్సవ సంబరాల వేడుకల వీడియో కాన్ఫరెన్స్

### 8483 మంది లబ్దిదారుల ఖాతాలో రూ. 10,82,27,642 జమ.






**వేలేరు/జూన్24/(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్రప్రభుత్వం రైతులకు వానాకాలం సీజన్ పంటల పెట్టబడి కింద రైతు భరోన నిధుల మంజూరు విజయోత్స సభ వేడుకల వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం హనుమకొండ జిల్లా వేలేరు మండలకేంద్రంలోని రైతువేధికలో జరిగిన రైతుభరోస విజయోత్సవ సంబరాల వేడుకల వీడియో కాన్ఫరెన్సు నిర్వహణ కార్యక్రమానికి ముఖ్యఅథిధిగా వేలేరు ఎంపిడిఒ లక్ష్మీ ప్రసన్న హాజరై మాట్లాడారు రాష్ట్రప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రైతులకు వానాకాలం సీజన్ పంటల పెట్టుబడి కింద నిధులు మంజూరులో భాగంగా వేలేరు మండలంలోని 8483 మంది రైతులకు రూ.10,82,27,642 కోట్ల వారి ఖాతాలలో జమఅయ్యాయని తెలిపారు కార్యక్రమంలో ఎంపిడిఒ లక్ష్మీ ప్రసన్న, ఎంపిఒ భాస్కర్, ఎఇఒ రాజశేఖర్, గ్రామపంచాయితీకార్యదర్శి జూల రవికుమార్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా భారీగా మున్సిపల్ కమిషనర్‌ల బదిలీ

### 129 మంది గ్రేడ్ 1 గ్రేడ్ 2, గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌లను ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఎంఏయూడి సెక్రటరీ టికె శ్రీదేవి ఉత్తర్వులు

హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా భారీగా మున్సిపల్ కమిషనర్‌లను బదిలీ చేస్తూ ఆ శాఖ ఎంఏయూడి సెక్రటరీ టికె శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 129 మంది గ్రేడ్ 1 గ్రేడ్ 2, గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌లకు పదోన్నతులు కల్పించడంతో పాటు వారికి వివిధ జిల్లాలో పోస్టింగ్‌లను కల్పించారు. దీనికి సంబంధించి ఐదు జిఓలను ఎంఏయూడి సెక్రటరీ టికె శ్రీదేవి జారీ చేశారు. జిఓ 302లో 11 మంది గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌లను, జిఓ 301లో 12 మంది గ్రేడ్ 1 మున్సిపల్ కమిషనర్‌లను, జిఓ 300 కింద గ్రేడ్ 2 మున్సిపల్ కమిషనర్‌లను 39 మందిని, 298 జిఓ కింద 11 మంది మున్సిపల్ కమిషనర్‌లను, 299 జిఓ కింద గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌లను 56 మందిని ప్రభుత్వం బదిలీ చేసింది. దీనికి సంబంధించిన ఆ శాఖ ఎంఏయూడి సెక్రటరీ టికె శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు.

# ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు రాజారపు ప్రతాప్ మృతి

## పలువురి నాయకుల సంతాపం- కుటుంబ సభ్యులకు పరామర్శ











**ధర్మసాగర్/జూన్24 (జర్నలిస్ట్ వార్త):**
ధర్మసాగర్ మండలం కరుణాపురం చెందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు రాజారపు ప్రతాప్ అనారోగ్యంతో సోమవారం రాత్రి హైదరాబాద్ లోని తన నివాసంలో మృతి చెందాడు. ప్రతాప్ భౌతిక కాయాన్ని మంగళవారం ఉదయం ఫాతిమా నగర్ తీసుకురాగా అక్కడి నుంచి వారి స్వగ్రామమైన పెద్దపెండ్యాలకు తీసుకొచ్చారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ స్పీకర్ సిరికొండ మధుసుదనచారి, మాజీ ఉపముఖ్యమంత్రి డాక్టర్ టి.రాజయ్య, మాజీ ఎంపీలు సిరిసిల్ల రాజయ్య, సీతారం నాయక్, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలు రాజకీయ పార్టీల నాయకులు హాజరై ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడు రాజారపు ప్రతాప్ 1998వ సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి పార్టీలో పూర్తి సమయం నాయకుడిగా పని చేశాడు. 1999వ సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన టిక్కెట్ ఆశించగా టిక్కెట్ దక్కలేదు. దీంతో పార్టీలోనే ఉంటూ జీవజ్యోతి వెల్ఫేర్ సోసైటీని ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హాయాంలో 2002వ సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులుగా నియామితులైయ్యాడు. అప్పటి వరకు ఉమ్మడి జిల్లాలోని పలు మండలాలకే పరిమితమైన ఆయన సేవలను రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు విస్తరింపచేశాడు. స్టేషన్ ఘనపూర్ నియోజక వర్గంలోని పలు గ్రామాల్లో తనకు సంబంధించిన స్వచ్ఛంద సేవా సంస్థ, ప్రభుత్వ సహాకారంతో పలు కాలనీల నిర్మాణాలు, కొన్ని గ్రామాలకు విద్యుత్తు సరఫరా, నీటి సరఫరా వంటివే కాకుండా వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా పలు ఆర్థిక సహకారాలను అందించారు గత కొద్ది రోజులగా అనారోగ్యానికి గురి కాగా హైదరాబాద్ లోని తన నివాసంలో ఉంటూ సోమవారం రాత్రి మృతి చెందాడు. ప్రతాప్ కు ఈఒక కొడుకు, కూతురు, భార్య ఉన్నారు.

# ప్రియుడితో కలసి తల్లిని లేపేసిన టెన్త్ విద్యార్థిని

## మృతురాలు వీరనారి చాకలి ఐలమ్మ మునిమనవరాలుగా గుర్తింపు





హైదరాబాద్**జూన్24/(జర్నలిస్ట్ వార్త):**ఆ
హైదరాబాద్ జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. సొంత కూతురే తల్లిని హత్య చేయించింది. అర్ధరాత్రి ఈ హత్య జరిగింది. హైదరాబాద్ శివారులోని జీడిమెట్లలో జరిగిన తల్లి హత్య కేసు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఓ పదో తరగతి చదువుతున్న బాలిక, ఆమె ప్రేమికుడు శివ, అతని తమ్ముడు కలిసి దారుణంగా తల్లి అంజలిని హత్య చేసిన ఘటన ఒక్కసారికి నగరాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ప్రేమకు అడ్డు చెప్పిందనే కారణంతో కన్నతల్లిని పదో తరగతి చదివే కుమార్తె ప్రియుడితో కలిసి హతమార్చింది. మృతురాలు అంజలి.. తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ మునిమనవరాలు కావడం గమనార్హం. పోలీసుల కథనం ప్రకారం.. విద్యార్థినికి కొన్ని రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ యువకుడు పరిచయమయ్యాడు. అతడితో ప్రేమాయణం సాగించిన బాలిక ఇంటి నుంచి వెళ్లి పోయింది. తన కుమార్తె కనిపించడం లేదని తల్లి జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్న క్రమంలో గత రాత్రి ప్రియుడితో కలిసి బాలిక ఇంటికి వచ్చింది. నిద్రిస్తున్న తల్లి అంజమ్మ గొంతు నులిమి, కర్రతో తలపై కొట్టి చంపినట్టు సమాచారం. ప్రియుడు, అతడి తమ్ముడితో కలిసి బాలిక ఈ దారుణానికి పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. ఘటన అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలికను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం. అయితే.. ఈ దారుణ ఘటనపై నిందితురాలు తేజ శ్రీ చెల్లి ప్రియచెప్పిన వివరాల మేరకు ..ట్యూషన్ నుంచి వస్తున్న నన్ను మా అక్క గల్లీ లోనే ఆపిందని, అమ్మ ఒక ఐటమ్‌ను తీసుకుని రమ్మంది. పదా వెళ్దాం అని తీసుకెళ్లిందని తెలిపింది. 20 నిమిషాల తర్వాత అక్కా నేను ఇంటికి చేరుకున్నామని, అప్పటికే కిచెన్ లో అమ్మ స్పృహ లేకుండా పడి ఉందని పేర్కొంది. అమ్మను నేను చూసుకుంటా.. నువ్వు బయటకు వెళ్ళి మీ ఫ్రెండ్ ఎవరినైనా తీసుకుని రా.. గల్లీలో ఆంటీ వాళ్లకు ఎవరికీ చెప్పకు అని చెప్పిందని వెల్లడించింది. అంతేకాకుండా.. మా అమ్మ ఇంకా చనిపోలేదు అని తెలుసుకున్న అక్క.. మళ్ళీ శివకి కాల్ చేసిందని, అమ్మ ఇంకా చనిపోలేదు. కాళ్లు చేతులు ఆడిస్తోంది అని చెప్పింది. మళ్ళీ శివ, యశ్వంత్ వచ్చారు. సుత్తితో అమ్మ తలపై కొట్టారు.. చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత వెళ్ళిపోయారు.. నేను అప్పుడే వచ్చాను. చూసే సరికి అమ్మ రక్తపుమడుగులో పడి ఉంది.. వెళ్ళి చేతులు రుద్దాను.. లేపే ప్రయత్నం చేశాను. కానీ అక్క మాత్రం దగ్గరికి కూడా రాలేదు. అమ్మ చనిపోయింది లేపి వేస్ట్ అన్నదని ప్రియ వెల్లడించింది.